

ఎయిడ్స్, లెప్రసీలపై అవగాహన

ప్రజాశక్తి-పాడేరు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు హెచ్ఐవి ఎయిడ్స్, లెప్రసి వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాడేరు నాగసాయి కళాబృందంతో కళా జాతా కార్యక్రమం నిర్వహించామని డిఎంహెచ్ఒ జమాల్ భాష తెలిపారు. శుక్రవారం అల్లూరి జిల్లా పాడేరు మండలంలోని కిండంగి గ్రామ పంచాయతీలో ఈ కార్యక్రమాన్ని ప్రదర్శించారు. ఎయిడ్స్ వ్యాప్తిపై నాటకం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఎయిడ్స్ నియంత్రణ విభాగం ద్వారా కళాజాత బృందం పాడేరు డివిజన్ లో వివిధ ప్రాంతాలలో 15 రోజులపాటు నిర్వహించి హెచ్ఐవి, ఎయిడ్స్, లెప్రసి వ్యాధులపై అవగాహన కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం డ్రై డే ఫ్రై డే కార్యక్రమంలో భాగంగా దోమలు వ్యాప్తిచెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలు, పరిసరాల పరిశుభ్రతపై వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీలక్ష్మి, జిల్లా ఎయిడ్స్, లెప్రసి అధికారి సుబ్రహ్మణ్యం రెడ్డి, కళా జాత బృంద సభ్యులు, సబ్ యూనిట్ అధికారి ధనుంజయ్, మినుములూరు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సిఆర్‌టిల వెట్టిచాకిరీ

- ఏడాదిలో 10 నెలలకే వేతనం
- ఆందోళన చేపడుతున్నా పట్టించుకోని ప్రభుత్వం
- 20న పాడేరులో యుటిఎఫ్ విద్యా సదస్సు


ప్రజాశక్తి-పాడేరు: ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలల్లో ప్రభుత్వం రెగ్యులర్ ఉపాధ్యాయుల నియమకాలను చేపట్ట లేదు. దీంతో, ఈ గిరిజన పాఠశాలల్లో సిఆర్‌టిలతోనే విద్యా బోధన చేయిస్తున్నారు. ప్రతి ఏడాది అవసరమైన మేరకు సిఆర్‌టిలను నియమిస్తున్నారు. పాఠశాలల్లో పని చేస్తున్న సిఆర్‌టిలను ఏటా రెన్యువల్ చేయడం అదనంగా మరికొంత మందిని నియమించడం వంటి ప్రక్రియ గిరిజన సంక్షేమ శాఖ చేపడుతోంది.

అల్లూరి జిల్లాలోని పాడేరు ఐటీడీఏ పరిధిలో ప్రస్తుతం 498 మంది సీఆర్టీలు పని చేస్తున్నారు. వీరిలో 250 మంది స్కూల్ అసిస్టెంట్లుగాను, 248 మంది పిఈటి, గ్రేడ్ 2 పండిట్స్, ఎస్జీటీలుగా పని చేస్తున్నారు. రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో 420 మంది సీఆర్టీలు ఉన్నారు. వీరిలో 150 మంది స్కూల్ అసిస్టెంట్లుగాను 270 మంది ఎస్జీటీలుగా గిరిజన సంక్షేమ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న సిఆర్‌టిలకు జీతం 10 నెలలకే ప్రభుత్వం చెల్లిస్తుంది. సిఆర్‌టిలకు అలవెన్స్‌లు ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో ప్రతినెలా వేతనంలో 50 శాతం నష్టపోతున్నారు. గత 11 ఏళ్లుగా గిరిజన సంక్షేమ పాఠశాలల్లో సీఆర్టీలు ఈ విధంగా వెట్టి చాకిరి చేస్తున్నారు. గిరిజన సీఆర్టీలు ప్రతి ఏటా తమ రెన్యువల్స్, వేతనాల మంజూరు, సర్వీస్ క్రమబద్ధీకరణ కోసం ఐటీడీఏ ముందు ఉద్యమాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోలేదు. సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొంటూ గిరిజన పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న సీఆర్టీలను రెగ్యులర్ చేయాలని, వెట్టి చాకిరీ నుంచి వారికి విముక్తి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతూ, సిఆర్టిల రెగ్యులరైజేషన్ ప్రధాన డిమాండ్‌గా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) పాడేరులో ఆదివారం విద్యా సదస్సును తలపెట్టింది.



ఆందోళన చేపడుతున్న సిఆర్‌టిలు (ఫైల్ పాటో)

సిఆర్‌టిలను రెగ్యులర్ చేయాలి



ఐదేళ్ల సర్వీస్ దాటిన సిఆర్‌టిలను రెగ్యులర్ చేయాలి. గిరిజన సంక్షేమ (విద్య) శాఖలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఐటీడీఏల పరిధిలో 1798 మంది సీఆర్టీలు పని చేస్తున్నాం. సిఆర్టిలను రెగుత్యలర్ చేసేటప్పుడు ప్రభుత్వం ఐదేళ్ల సర్వీసును పరిగణలోకి తీసుకోవాలి. డీఎస్సీలో సీఆర్టీ పోస్టులను మినహాయించాలి.

టీ.నూకరాజు,
సీఆర్టీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

సమస్యలను పరిష్కరించాలి



గిరిజన సిఆర్టీలకు 12 నెలల వేతనం, 22 రోజుల సెలవులు ప్రభుత్వం తక్షణమే కల్పించాలి. 2019 నుంచి 2021 వరకు సిఆర్టీలకు 12 నెలల వేతనం ప్రభుత్వం చెల్లించింది. గత ఏడాది నుంచి పది నెలలకు వేతనం కుదించింది. 12 రోజులు మాత్రమే సెలవులు మంజూరు చేస్తున్నారు. సిఆర్టిలను తక్షణమే రెగ్యులర్ చేయాలి

పి.మహేశ్వరరావు,
యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి



సమావేశంలో పాల్గొన్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే, వెలుగు అధికారులు

గిరిజన రైతుల అభివృద్ధికి పలు పథకాలు

ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే

ప్రజాశక్తి -రంపచోడవరం

ఏజెన్సీలోని గిరిజన రైతులు అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు ప్రవేశ పెట్టినట్లు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏడు మండలాలకు చెందిన వెలుగు ఏపీఎంలు, డిపిఎంలు, ఎపీడీలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన రైతులకు ఉపాధి కల్పించే విధంగా కోళ్ల పెంపకం, మిల్క్ డెయిరీ, జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్లు, చేపల పెంపకం తదితర వ్యవసాయ ఉత్పత్తులు అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా 300 మంది గిరిజన రైతులకు రూ.40 లక్షల వరకు రుణాలు మంజూరు చేయవచ్చన్నారు. ఈ రుణాలు తీసుకున్న రైతులు ఫుడ్ ప్రాసెసింగ్ చేసి మార్కెటింగ్ చేసే విధంగా గ్రామాల్లో సభ్యులను ఎంపిక చేయాలని సూచించారు. అడవి ఉత్పత్తులకు కోల్డ్ స్టోరేజీ వాహనం ఏర్పాటు చేసుకుని విధంగా ఒక యూనిట్‌గా ఏర్పడిన సభ్యులకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో వెలుగు ఎపిడి ఎ.శ్రీనివాసరావు, డిపిఎం అపర్ణ, యాంకర్ పర్సన్ రామరాజు, ఎపీఎలు శ్యాం కుమార్, మధు, అప్పారావు, ఆదినారాయణ, నీలవేణి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ అంబులెన్స్ ప్రారంభం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అల్లూరి జిల్లా శాఖకు (ఢిల్లీ రెడ్ క్రాస్) నుండి వచ్చిన నూతన అంబులెన్సును జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, సబ్ కలెక్టర్ అభిషేక్ కలిసి జెండా ఊపి శుక్రవారం ఐటిడిఎ కార్యాలయం వద్ద లాంఛనంగా ప్రారంభించారు. ఈ సంద్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల సేవలో రక్తదాన అవసరానికి, అత్యవసరమైన పరిస్థితులలో ఈ అంబులెన్స్‌ను ఉపయోగించాలని సూచించారు. శ్రీకాకుళం రెడ్ క్రాస్ ఇచ్చిన అంబులెన్స్‌ను మహా ప్రస్థానం సేవలకు ఉపయోగించాలని సూచించారు. పేదలు మహాప్రస్థానం వాహనం కొరకు పోన్: 7569982899, 6303841383నంబర్లకు చేస్తే అంబులెన్స్ పంపిస్తారని చెప్పారు. అంబులెన్స్‌లో సౌకర్యాలను, పని తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ బి.దయానిధి, జిల్లా రెడ్ క్రాస్ సెక్రటరీ ఈశ్వరరావు, ట్రెజరర్ టి.అప్పారావు, జిల్లా ఉన్నతాధికారులు, మేనేజింగ్ కమిటీ మెంబర్స్ గౌరీశంకర్ లోహితాస్, సూర్యారావు, సతీష్, సింహాచలం, కోఆర్డినేటర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వృద్ధుల హెల్ప్ లైన్ పోస్టర్ ఆవిష్కరణ

పాడేరు టౌన్: వయో వృద్ధులు సహాయం కొరకు హెల్ప్ లైన్ సేవలను ఉపయోగించుకోవాలని అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఐటిడిఎ సమావేశ మందింలో జాతీయ వృద్ధుల హెల్ప్ లైన్ 14567 పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాచారం, భావోద్వేగ సహాయం, తల్లితండ్రులు-వృద్ధుల చట్టాలు, వ్యక్తిగత, కుటుంబ సమస్యలపై న్యాయ సలహాలు, సూచనలు, క్షేత్ర స్థాయిలో సహాయం కోసం జాతీయ వృద్ధులకు హెల్ప్ లైన్ 14567 టోల్ ఫ్రీ నెంబర్ ను వయో వృద్ధులు ఉపయోగించుకోవాలన్నారు. హెల్ప్ లైన్ 14567పై వృద్ధులకు, తల్లిదండ్రులకు అవగాహన కలిగేలా జిల్లా యంత్రాంగం చూడాలని, ప్రతి సచివాలయం సిబ్బంది ప్రజలకు విధిగా అవగాహన కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వి.అభిషేక్, డిఆర్ఒ బి.దయానిధి, జాతీయవృద్ధుల దివ్యంగులు-వయోవృద్ధుల శాఖ సిబ్బంది కె.అప్పల నాయుడు, వృద్ధుల హెల్ప్ లైన్ 14567 ఎఫ్ఆర్ఒ ప్రసాద్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నేతలు

కాఫీ కార్మికుల సమస్యలపై సిఐటియు వినతి

ప్రజాశక్తి -పాడేరు: పాడేరు ఏజెన్సీలో కాఫీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీఎఫ్‌డిసి డివిజనల్ మేనేజర్ జి.కృష్ణబాబుకు శుక్రవారం సిఐటియు నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, కాఫీ కార్మికులకు ప్రతి సంవత్సరం పెంచవలసిన వీడిఏ పాయింట్ల ప్రకారం, రోజువారి కూలి రేట్లు పెంచాలని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కాఫీ తోటలో పని చేస్తున్న దిగువ స్థాయి సిబ్బంది(హెల్పర్స్) కు కనీస వేతనం రూ.26 వేలు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో ఖాళీగా ఉన్న పోస్టులలో సిబ్బంది నియామకం చేపట్టాలని, ఈపీఎఫ్, ఈఎస్ఐ సమస్యలు పరిష్కారం చేయాలని తెలిపారు. రోజువారి కూలి రేట్ల ప్రకారం సీజన్లో నైట్ వాచ్మెన్‌లకు వేతనం, సేఫ్టీ పరికారాలు ఇవ్వాలన్నారు. క్వార్టర్స్ పరిధిలో ఉన్న కార్మికులకు మంచి నీరు, విద్యుత్ కల్పించాలన్నారు. క్వార్టర్స్ రిపేర్లు, తోటలో జరిగే ప్రమాదాలు నివారణ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎల్ సుందర్రావు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు పి.లక్కు, కామరాజు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కీటక జనిత వ్యాధుల నివారణపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని నడింపాలెం, పెదమాకవరం ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సోమయ్య, రామారావు, పెదమాకరం హెచ్ఎం దేవేశ్వరరావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యా సదస్సును జయప్రదం చేయాలి

- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పి.మహేశ్వరరావు

ప్రజాశక్తి-పాడేరు: గిరిజన విద్యా రంగంలోని దీర్ఘకాల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20న రాష్ట్ర విద్యా సదస్సును ఉపాధ్యాయులు జయప్రదం చేయాలి యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పి.మహేశ్వరరావు కోరారు. శుక్రవారం మండలంలోని గుత్తులపుట్టు, శ్రీ కృష్ణా పురం, కందమామిడి, తలారిసింగి ఆశ్రమ ఉన్నత పాఠశాలను పాడేరులోని ఇంగ్లీష్ మీడియం పాఠశాలను యుటిఎఫ్ నాయకులు సందర్శించి ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను విద్యాసదస్సుకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ. అన్ని మండలాల్లో పర్యటించి ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులను విద్యాసదస్సుకు ఆహ్వానించామని తెలిపారు. దీర్ఘకాలంగా గిరిజన విద్యారంగంలో ఉన్న సమస్యల పరిష్కార నిమిత్తం ప్రభుత్వం దృష్టికి తీసుకు రావడానికి ఈనెల 20న ఆదివారం పాడేరులో నిర్వహిస్తున్న విద్యా సదస్సుకు గిరిజన సంక్షేమ పాఠశాలల ఉపాధ్యాయులు, సీఆర్టీలు, భాషా వాలంటీర్లు హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు డిరాము, అల్లూరి జిల్లా నాయకులు నాగేశ్వరరావు క్రీ బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహేశ్వరరావు

ముంచింగిపుట్టు: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.ధర్మారావు, కార్యవర్గ సభ్యులు పర్యటించారు. ఈ నెల 20న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు పుండారి, సెక్రటరీ గోపి పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సిపిఎం మండల నాయకులు,

సిపిఎం నేత మహదేవ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-అరకులోయరూరల్: మండలంలోని సుంకరమెట్ట పంచాయతీ దండబాడు గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు చిట్టం నాయక్ మహాదేవ్ గురువారం అనారోగ్యంతో అరకులోయ ఏరియా ఆస్పత్రిలో మరణించారు. శుక్రవారం మహదేవ్ భౌతికకాయంపై అరకులోయ సిపిఎం మండల కార్యదర్శి కె.రామారావు, సిఐటియు మండల కార్యదర్శి పి.బాలదేవ్, సుంకరమెట్ట సర్పంచ్ జి.చిన్నబాబు సిపిఎం సీనియర్ నాయకులు కె.జగన్నాధంలు ఎర్ర జెండా కప్పి జోహార్లు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, మహాదేవ గిరిజన చట్టాల హక్కులు బాక్సైట్ పోరాటం, వ్యవసాయ పోడు భూములకు పట్టాలు, వి.ఎస్.ఎస్ భూములకు పట్టాల మంజూరుకు ముందుండి పోరాటం చేశారని కొనియాడారు. పంచాయితీ పరిధిలో ప్రతి గ్రామంలో రోడ్లు, సిసి రోడ్లు డ్రైనేజీలు మంచినీరు సదుపాయం కల్పించాలని పోరాడారని చెప్పారు. ఆయన మృతి ఉద్యమానికి తీరని లోటు అన్నారు. ఆయన స్ఫూర్తితో భవిష్యత్తులో గిరిజన ప్రాంతం సమస్యలపై పోరాటం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పంచాయితీ నాయకులు సిహెచ్ గురుమూర్తి పి.రాజు, క్రిష్ణ, సిహెచ్ ప్రసాద్, కేశవ్, సిపిఎం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ హక్కులు, చట్టాల రక్షణకు ఐక్య పోరాటం

గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు

ప్రజాశక్తి-విఆర్.పురం

గిరిజనుల హక్కులు, చట్టాల రక్షణకు ఆదివాసీలంతా ఐక్యమై పోరాటం చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని పెద్దమటపల్లి పంచాయతీ పరిధి కిష్టారం గ్రామంలో పూనం ప్రదీప్ కుమార్ అధ్యక్షతన ఏపీ గిరిజన సంఘం మండలం మూడో మహాసభ జరిగింది. ముందుగా కుంజ నాగిరెడ్డి సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం జాతీయ అటవీ సంరక్షణ చట్టానికి సవరణ చేస్తూ బిల్లును రూపొందించిందని, ఇది ఆమోదం పొందితే పీలా చట్టం నిర్వీర్యమవుతుందని, ఏజెన్సీలోని సంపద కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి పోతుందని తెలిపారు. అడవుల నుండి ఆదివాసీలను గెంటివేయాలని కుట్ర చేస్తుందన్నారు. అర్హతలేని వారిని ఎస్టీ జాబితాలో చేర్చి గిరిజనుల రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీస్తున్నట్లు చెప్పారు. వైసిపి, టిడిపి, బిజెపి పార్టీలు ఐక్యమై గిరిజనుల హక్కులను చట్టాలపై దాడి చేస్తున్నాయన్నారు. అడవిలో జంతువులకు ఉండే ప్రాధాన్యత గిరిజనులకు ఈ ప్రభుత్వం ఇవ్వటం లేదన్నారు. గిరిజనులకు షెడ్యూల్ ఏరియాలో ఉద్యోగాలు కల్పించే జీవో 3 పునరుద్ధరణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా గిరిజనుల పట్ల చిత్తశుద్ధి ఉంటే వెంటనే జీవో నెంబర్ 3ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు

సిఐటియు జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ, సీసం రమేష్ మాట్లాడుతూ. ఏజెన్సీకి ఆనుకొని జీవిస్తున్న గిరిజనుల గ్రామాలను ఐదవ షెడ్యూల్‌లో చేర్చకపోవడంతో వారు తీవ్రంగా నష్టపోతున్నారని, వారిని ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. అర్హులు కాని బోయ, వాల్మీకి బెంత్ ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చడానికి చర్యలు చేపట్టడం దారుణమన్నారు. పోలవరం నిర్మాణంలో అధిక శాతం గిరిజనులే నిర్వాసితులవుతున్నా, వారికి పునరావసం కల్పించడంలో పాలక పక్షాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు.

మండల కమిటీ ఎన్నిక

అనంతరం గిరిజన సంఘం మండల కమిటీ 21 మందితో ఎన్నికైంది. సంఘం మండల అధ్యక్షులుగా పులి బుజ్జి, కార్యదర్శిగా పూనం ప్రదీప్ కుమార్, సహాయ కార్యదర్శులుగా పండ వెంకటేష్, మోసం చందర్, తోడం రవికుమార్, ఉపాధ్యక్షులుగా పండా గోపాల్, సోయం జోగారావు, కురసం బేబీ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కారం లక్ష్మి, గిరిజన సంఘం నాయకులు కాక అర్జున్ దొర, పులి సంతోష్, వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి సోయం చిన్నబాబు. కుంజ నాగిరెడ్డి, కారం సత్తిబాబు. చిక్కాల రామారావు కార్యకర్తలు పాల్గొన్నారు.



అధ్యక్ష, కార్యదర్శులు బుజ్జి, ప్రదీప్‌కుమార్



మంచు కారణంగా లైట్లు వేసుకొని ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారుడు

వణికిస్తున్న చలి

తగ్గుతున్న ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి-సీలేరు

జీకే.వీధి మండలం సీలేరు, దారకొండ, దుప్పిలివాడ పరిసర ప్రాంతాల్లో చలి వణికిస్తోంది. రెండు రోజులుగా రాత్రి 8 గంటలకే 13, 15 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చలి తీవ్రత ఎక్కువైంది. చలి తీవ్రత వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెల్లవారుజాము నుంచే మంచు కమ్మేయడంతో చలి ప్రజలను గజగజ వణికిస్తోంది. సీలేరు నుంచి మైదాన ప్రాంతానికి వాహనాలపై వెళ్లాలంటే మంచు కారణంగా రహదారులు కనిపించడం లేదు. చలికి తాళలేక మంటలు వేసుకొని, ఉన్ని దుస్తులు వేసుకొని ఉపశమనం పొందుతున్నారు. రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత అధికమై ఇళ్లలోంచి బయటికి రాలేని పరిస్థితి నెలకొంటుందని ఆందోళన చెందుతున్నారు.

దారాలమ్మ ఆలయంలో సిసి కెమెరాలు

ప్రజాశక్తి- సీలేరు

జికె.వీధి మండలంలో వెలసిన దారాలమ్మ అమ్మవారి ఆలయ పరిసరాల్లో ఏడు సీసీ కెమెరాలను ఎండోమెంట్ అధికారులు ఏర్పాటు చేశారు. ఇటీవల దారుణమ్మ అమ్మవారు ఆలయంలో దోపిడీ దొంగలు అమ్మవారి బంగారం నగలు అపరించుకుపోయిన విషయం విధేతమే. ఈ నేపథ్యంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు.

బోటు ప్రమాద మృతుడు రామకృష్ణ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలి

సిపిఎం నేత సత్యనారాయణ, ఎంపిపి కారం లక్ష్మి

ప్రజాశక్తి-విఆర్.పురం

పోచవరం టూరిజం బోటు పాయింట్ వద్ద కొత్త రాజాకు చెందిన బోటులో పని చేస్తూ గురువారం జరిగిన ప్రమాదంలో మృతి చెందిన భవానీ శంకర్ (22) కుటుంబానికి బోటు యజమాని నష్ట పరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ ఎంపిపి కారం లక్ష్మీ డిమాండ్ చేశారు. శుక్రవారం రేఖపల్లిలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ ప్రమాదంపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి బోటు యాజమాన్యంపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి సోయం చినబాబు, చిన్నమట్టిపల్లి ఎంపీటీసీ పూనెం ప్రదీప్ కుమార్, శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సత్యనారాయణ

పోలీసుల ఆధ్వర్యాన రోడ్డు మరమ్మతులు

ప్రజాశకి-అడ్డతీగల

పోలీసు శాఖ ఆధ్వర్యాన అడ్డతీగల- వేటమామిడి ప్రధాన రహదారిలో టేకు ప్లాంటేషన్ మలుపు వద్ద రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగించి, రోడ్డు మధ్యలో ఏర్పడిన బారీ గుంతలను సిమెంట్, కంకరుతో శుక్రవారం పూడ్చారు. ఈ సందర్భంగా ఎస్సై అప్పలరాజు మాట్లాడుతూ గ్రామస్తులు కూడా స్వచ్ఛందంగా ఆయా గ్రామాల్లోని మలుపుల వద్ద తుప్పలను తొలగించాలని సూచించారు.



రోడ్డు మలుపులో తుప్పలు తొలగిస్తున్న పోలీసులు

'స్పందన'కు సకాలంలో రావాలి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

20 మంది అధికారులకు షోకాజ్ నోటీసులు



సమస్యలు వింటున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: స్పందన కార్యక్రమానికి జిల్లా అధికారులు నిర్దిష్టమైన సమయానికి హాజరు కావాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. స్పందనకు ఆలస్యంగా హాజరైన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసారు. సమయపాలన పాటించని అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం ఐటిడిఎ ఏ కార్యాలయంలో స్పందన కార్య క్రమాన్ని నిర్వహించారు. స్పందనలో స్వీకరించిన సమస్యలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్య మంత్రి, ప్రధాన కార్యాదర్శి ప్రతీ నెల స్పందన ఫిర్యాదులపై సమీక్షిస్తున్నారన్నారు. ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. స్పందనపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్పందనకు ఆలస్యంగా వచ్చిన 20 మంది జిల్లా అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసారు.

105 ఫిర్యాదులు స్వీకరణ

స్పందనకు వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 105 ఫిర్యాదులను స్వీకరించారు. సమస్యలు పరిష్కారం పాటించి ఎప్పటికప్పుడు స్పందన పోర్టల్లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. పెదబయలు మండలం పోయిపల్లి గ్రామ పంచాయతీ అర్జాలు గ్రామంలో ఆశ వర్కరును నియమించాలని గ్రామస్తులు జె.సోమన్న, పి.కుర్నన్న వినతిపత్రం సమర్పించారు. జి.మాడుగుల మండలం వంతాల పంచాయతీ లక్కపాడు గ్రామానికి రోడ్డు నిర్మించాలని గ్రామస్తుల పాంగి నర్సింగరావు, కిల్లో సునీల్ కోరారు. కొయ్యూరు మండలం కొనపర్తి పంచాయతీ చుక్కల పనుకు గ్రామానికి రహదారి, విద్యుత్ సదుపాయం కల్పించాలని సర్పంచ్ ఆర్. శ్రీనివాస్ వినతిపత్రం సమర్పించారు. హుకుంపేట మండలం ఒల్లా గ్రామానికి చెందిన బలిలో నర్సమ్మ తనకు విక్రయం ద్వారా దఖలు పడిన భూమిని తన పేరున వెబ్ ల్యాండ్ రికార్డులలో నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వి.అభిషేక్, డి ఆర్ఓ బి.దయానిధి, ఐటిడిఎ ఏపిఓ వి.ఎస్ ప్రభాకర రావు, గిరిజన సంక్షేమ శాఖ డిడి ఐ.కొండలరావు, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ డివిఆర్ఎం రాజు, రహదారులు భవనాల శాఖ ఇఇ బాల సుందర బాబు, పంచాయతీరాజ్ శాఖ ఇఇ కె.లావణ్య కుమార్, పీఆర్ ఇఇ కొండయ్య పడాల్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జమాల్ భాషా పాల్గొన్నారు

20న వన భోజనాలు



మాట్లాడుతున్న బిసి నాయకులు

ప్రజాశక్తి-అరకులోయ : ఈనెల 20న అరకులోయ, డుంబ్రిగుడ మండలాలకు చెందిన బిసి, మైనార్టీ కుటుంబాలతో వన భోజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆ సంఘాల నాయకులు గెడ్డం నర్సింగరావు, పట్నాల రాంబాబు, మురళి పట్నాయక్, కడలి శివ, ఎస్కే యాసీను, రాజు, మహిళ నాయకురాలు దివ్య తెలిపారు. శుక్రవారం విలేకరులతో వారు మాట్లాడుతూ, ఏడాది పొడుగునా ఎవరి పనుల్లో వారు బిజీగా ఉంటున్న తరుణంలో అందరూ ఒకే చోట కలిసి ఆనందంగా ఉల్లాసంగా గడపాలన్న ఉద్దేశంతో ప్రముఖ సందర్శిత ప్రాంతమైన పద్మాపురం ఉద్యాన మన కేంద్రంలో వన భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. నేపథ్యంలో అరకులోయ, డుంబ్రిగుడ మండలాలకు చెందిన బీసీ, మైనార్టీ కుటుంబాలు తప్పనిసరిగా వనభోజన కార్యక్రమానికి హాజరు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.

మొరాయించిన బస్



బస్సును తోస్తున్న ప్రయాణికులు

ప్రజాశక్తి -పెదబయలు రూరల్: అల్లూరి జిల్లా పాడేరు ఆర్టీసీ డిపో నుండి డుడుమ బస్ పెద బయలులో మొరాయించింది. దీంతో, బస్సులో ప్రయాణిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు బస్సును వెనుక నుంచి తోయటంతో కదిలింది. డుడుమ బస్సుతో తరచుగా ఇటువంటి ఇబ్బందులు పడవలసి వస్తుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తంచేశారు. కాలం చెల్లిన బస్సును మార్చాలని కోరారు.

త్వరలో తెలుగు శక్తి ప్రజా చైతన్య యాత్ర



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రామ్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రభుత్వ విధానాలను ఎండగట్టే క్రమంలో త్వరలోనే ప్రజా చైతన్య యాత్ర ప్రారంభిస్తానని తెలుగు శక్తి అధ్యక్షుడు బివి.రామ్ తెలిపారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టే క్రమంలోనే తాను ప్రజల్లోకి వెళుతున్నట్లు తెలిపారు. ముందుగా ఉత్తరాంధ్రలో యాత్ర కొనసాగుతుందన్నారు. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా తన ప్రజా చైతన్య యాత్ర ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే వారిని వేధించడమే ప్రభుత్వం పనిగా పెట్టుకుందని ఆరోపించారు. తాను ప్రభుత్వ వైఖరిని విమర్శిస్తున్న నేపథ్యంలో మంత్రి అమర్‌నాథ్ అనుచరుడు ఫోన్ చేసి బెదిరించడం ఎంతవరకు సమంజసమన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు, ఎంవిపి పోలీస్ స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేసినా బెదిరించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేయలేదన్నారు. ఏది ఏమైనా తాను బెదిరింపులకు భయపడేది లేదని, రాబోయే ఎన్నికలలో 175కి 175 స్థానాలలో తెలుగుదేశం పార్టీని గెలిపించి నారా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేస్తామని అన్నారు.

ప్రేమోన్మాదిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : దేశ రాజధాని ఢిల్లీలో శ్రద్ధా వాకర్‌ను ప్రేమ పేరుతో వంచించి, వివాహం చేసుకుంటానని మోసగించి ఆ తరువాత దారుణంగా హత్య చేసిన అప్తాబ్ పూనావాలాను కఠినంగా శిక్షించాలని ఎల్‌ఐసి వర్కింగ్ ఉమెన్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ జి.సూర్యప్రభ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో మహిళలపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో ఢిల్లీలో వెలుగు చూసిన శ్రద్ధా వాకర్ హత్య ఇంకొక హృదయ విదారక సంఘటన అన్నారు. హత్య చేసి ఆమె శరీరాన్ని ముక్కలు ముక్కలుగా చేసి ఫ్రిజ్‌లో భద్రపరిచి రోజుకొక ముక్కను వేర్వేరు ప్రాంతాల్లో విసిరి, క్రూరంగా వ్యవహరించిన నిందితుడు అప్తాబ్ పూనావాలాను క్షమించకూడదన్నారు. ఆ సంఘటనపై కేంద్రమంత్రి కేశవ్ కిషోర్ వ్యాఖ్యలను ఆమె ఖండించారు.

మృతి చెందిన విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలి

ఐటిడిఎ వద్ద ప్రజాసంఘాల ఆందోళన

దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్



ఐటిడిఎ గేటు ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు,

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు లోని లోచలిపుట్టు జిటిడబ్ల్యూ ఆశ్రమ బాలుర పాఠశాల (నెంబర్-1 స్కూల్)లో 7వ తరగతి విద్యార్థి పాంగి నవీన్ (12) అనుమానస్పద మృతిపై సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గిరిజన, విద్యార్థి, ప్రజా సంఘాల, ఆయా పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం బాధిత కుటుంబంతో కలసి ఐటిడిఎ గేటు ఎదుట ఆందోళన చేపట్టారు. అప్పటికే సిఐ సుధాకర్, ఎస్ఐలు లక్ష్మణరావు, రంజిత్ కుమార్, హుకుంపేట ఎస్ఐ సతీష్, పోలీసులు ఐటిడిఎ లోపలకు వెళ్లకుండా వారిని అడ్డుకున్నారు. దీంతో మృతి చెందిన విద్యార్థి తల్లిదండ్రులతో కలసి గేటు ముందు బైఠాయించి ధర్నా చేశారు. గిరిజన విద్యార్థి మృతిపై అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే పాఠశాల హెచ్ఎం, వార్డెన్ పై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరిపించి, బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి తండ్రి మహేంద్ర మాట్లాడుతూ, ఇంటికి వచ్చిన తన కుమారుడిని మంగళవారం పాఠశాలకు వెళ్లాలని బస్సు ఎక్కించానని చెప్పారు. బుధవారం ఉదయం తన కుమారుడు పాఠశాలకు వెళ్లాడో లేదో తెలుసుకునేందుకు పాఠశాల వద్దకు వచ్చినట్లు చెప్పారు. పాఠశాల సిబ్బంది సాయంత్రం 5 గంటల వరకు పిల్లాడిని చూసేందుకు వీలు లేదనడంతో తన గ్రామానికి వెళ్లేందుకు ఇబ్బంది పడతానని కుమారుడిని చూడకుండానే వెళ్లిపోయినట్లు చెప్పారు. ఆ రాత్రి అబ్బాయి మృతి చెందినట్లు తమకు సమాచారం అందిందన్నారు. తమ కుటుంబానికి నష్టపరిహారంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని కోరారు.

గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాలకి లక్కుతో పాటు బాధిత కుటుంబానికి, విద్యార్థి సంఘాల నాయకులను లోపలికి అనుమతించడంతో స్పందన కార్యక్రమంలో ఉన్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలసి మాట్లాడారు. బాధిత కుటుంబానికి ఆదుకుంటామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకుడు పాండు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రభుదాసు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ కె.రాజశేఖర్, ఎబివిపి నాయకుడు ఆనంద్, ఆదివాసీ సేన రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.రాజారావు పాల్గొన్నారు.

అధికారులు స్పందించకపోవడం అమానుషం

గిరిజన విద్యార్థి మృతిపై స్పందించకపోవడం అమానుషమని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాలికి లక్కు అన్నారు. గిరిజన విద్యార్థి మృతి చెందితే ఇప్పటివరకు జిల్లా కేంద్రంలోని ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యే పాఠశాలను సందర్శించికపోవడం, బాధిత కుటుంబానికి భరోసా ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఇటువంటి పరిస్థితులు నెలకొంటున్న దృష్ట్యా గిరిజన తల్లిదండ్రులు తమ పిల్లలను ఆశ్రమ పాఠశాలల్లో ఎలా చదివిస్తారన్నారు. బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాలల్లో ఉన్నతాధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడంతోనే ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటుందని ఆరోపించారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపాలతోనే ఆయా పాఠశాలల సిబ్బంది విద్యార్థులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

ఐటీడీఏ అధికారులదే బాధ్యత

హుకుంపేట: నవీన్ హత్యకు ఐటీడీఏ అధికారులే బాధ్యత వహించాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక మండల కన్వీనర్ కే.ఆనంద్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. హత్య జరిగి రెండు రోజులు అవుతున్నా సమగ్ర దర్యాప్తు చేయకపోవడం సరికాదన్నారు. నవీన్ కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు

పలుచోట్ల గిరిజన ఆత్మగౌరవ ర్యాలీలు





రంపచోడవరం, అడ్డతీగలలో గిరిజన ఆత్మగౌరవ ఉత్సవ ర్యాలీలు



పాడేరు ఆత్మగౌరవ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పాడేరు టౌన్: గిరిజన ఆత్మగౌరవ దినోత్సవం సందర్భంగా శుక్రవారం అల్లూరి జిల్లా కేంద్రంలో స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్వాతంత్ర సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా జయంతి వారోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న వేడుకలలో భాగంగా శుక్రవారం పట్టణంలోని పాత బస్ స్టాండ్ అంబేద్కర్ కూడలి నుండి ఐటిడిఎ కార్యాలయం వరకు స్వచ్ఛతా ర్యాలీ ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమానికి పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఈనెల 15వ తేదీన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్న చేతుల మీదుగా విశాఖలో గిరిజన జాతీయ గౌరవ దినోత్సవం వేడుకలను ప్రారంభించడం జరిగిందన్నారు. గిరిజన వీరుల త్యాగాలు, పోరాటాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒలు విఎస్. ప్రభాకరరావు, ఎం.వెంకటేశ్వరరావు, టిడబ్ల్యు డిడి ఐ.కొండలరావు, డివిల్ పిఒ పిఎస్ కుమార్, ఎంపిడిఒ కె.సాయినవీన్, ఎటిడబ్ల్యుఒ ఎల్.రజిని, విద్యార్థినీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల బాలురు 1, 2, బాలికల ఆశ్రమ పాఠశాల 1,2 విద్యార్థులు పర్యావరణంపై ర్యాలీ నిర్వహించారు. నాలుగు రోడ్ల కులాలలో మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, గృహాల పరిసర ప్రాంతాలను స్వచ్ఛందంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాణిక్యాలరావు, లక్ష్మణుడు, లక్ష్మి, పల్లవి, ఎల్ఇఎఫ్ హెచ్ఎం రాధాకృష్ణ పాల్గొన్నారు.

హుకుంపేట: -పరిసరాలను శుభ్రం చేస్తూ పరిశుభ్రత పాటించాలని జెడ్పిటిసి రేగం మత్స్యలింగం కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ చేపట్టారు. పరిసరాల పరిశుభ్రత పై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జడ్పిటిసి మాట్లాడుతూ, యువతీ యువకులు స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలను చైతన్యవంతులుగా చేసి మార్పు తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్ వెంకటరావు, ఎంఈఓ ఎస్.రామసంద్రరావు, ఆర్డబ్ల్యూఎస్ ఏఇ. రమేష్, పిఆర్ఈ సాంబ, ఏపీవో లింగమూర్తి, పంచాయతీ కార్యదర్శులు పరశురాం, శ్రీనాథ్, సర్పంచ్లు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: స్వచ్ఛ పాఠశాల నిర్వహణ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని మూడు రోడ్ల జంక్షన్ వద్ద శుక్రవారం స్థానిక గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల విద్యార్థులు స్వచ్ఛతపై ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.అర్జున్ మాట్లాడుతూ. పరిశుభ్రం తోనే ఆరోగ్యం కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు తమ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.సుభాకర్, ఎం.రాజారావు, బి కృష్ణమూర్తి, ఏ.ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం : గిరిజనుల ఆత్మగౌరవ ఉత్సవాలకు సంబంధించిన గిరిజన విద్యార్థులతో శుక్రవారం నిర్వహించిన ర్యాలీని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే స్థానిక ఐటిడిఎ కార్యాలయం వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 19, 20 తేదీలలో విశాఖపట్నంలో నిర్వహిస్తున్న గిరిజనుల ఆత్మగౌరవ ఉత్సవాలకు ఏజెన్సీలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, ఇతర పాఠశాలలోని చదువుతూ వివిధ రకాల ఆటల పోటీలలో ప్రతిభ కనపరిచిన 130 మంది విద్యార్థులను ఎంపిక చేసి పంపడం జరిగిందని తెలిపారు. ఈనెల 21న ఈ ఉత్సవాలకు సంబంధించిన ర్యాలీలు ప్రజా ప్రతినిధులతో నిర్వహించి, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సిహెచ్.శ్రీనివాసరావు, లైజన్ అధికారి బిఎస్.కుమార్, సూపరింటెండెంట్లు బి.కిషోర్, రమణ, ప్రధానోపాధ్యాయులు కెఆర్‌పి.కుమార్, బుల్లయ్య, మల్లమ్మ, సిఎం.ఓలు, ప్రసాద్, కె.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ కె.తిరుపతిరావు, కె.పోతురాజు, వార్డెన్లు, ఎస్‌వి.రాజారావు, వెంకన్న, వీరమణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అడ్డతీగల : మండల కేంద్రంలో ఆదివాసీల ఆత్మ గౌరవ ఉత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం అడ్డతీగల వీధులలో భారీ ర్యాలీ నిర్వహించారు. దేవి గుడి సెంటర్ వద్ద మానవహారం నిర్వహించి మన్యం వీరుల చరిత్రను గుర్తు చేస్తూ అల్లూరి సీతారామరాజు, కొమరం భీమ్, గాము గంటన్న దొర, మల్లు దొర, మన్యం వీరుల గాదను విద్యార్థులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ బాబు, గోము కృష్ణ, ఆశ్రమ పాఠశాల బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.శాంతిమతి, వరదానం, స్వర్ణాంజలి, వీరబాబు, బాలరెడ్డి, పల్లం రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

ప్రజాశక్తి-అడ్డతీగల : అడ్డతీగల శివారు ప్రాంతమైన టేకు ప్లాంటేషన్ వద్ద శుక్రవారం కారు, ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్ నుజ్జునుజ్జు అయింది. బైక్‌పై ప్రయాణిస్తున్న మారేడుమిల్లికి చెందిన డి.శాంతి ప్రవీణ్‌కు చెయ్యి విరిగింది. బి.ప్రభుదాస్ స్వల్పంగా గాయపడ్డాడు. కారులో ఉన్న రాజమండ్రికి చెందిన కె.ఈశ్వరరావుకు కాలు, చాతి భాగాల్లో గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో ఎల్లవరం పిహెచ్‌సికి తరలించగా వారికి డాక్టర్ భాస్కర్ వైద్య సేవలందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం రంపచోడవరం తరలించారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ అప్పలరాజు పరిశీలించారు.

పర్యావరణ పరిరక్షణకు ఇష్రె కృషి అభినందనీయం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డిఆర్ఎం అనూప్ కుమార్ సత్పతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పర్యావరణ పరిరక్షణ కోసం సహజ వనరులను వినియోగించుకుంటూ.. పలు అవగాహన కార్యక్రమాలతో ఇష్రె ముందుకు వెళ్లడం అభినందనీయమని డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్ కుమార్ సత్పతి అన్నారు. ఇష్రె (ఇండియన్ సొసైటీ ఆఫ్ హీటింగ్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ ఇంజినీర్స్) విశాఖపట్నం ఛాప్టర్ ఆధ్వర్యంలో దిష 2.0 థీమ్ 2022 - 23 పేరిట వైఎంసిఎ హాల్లో శుక్రవారం ఉర్జావరన్ సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ అధిక ఖర్చుల కారణంగా గ్రామీణ భారతదేశంలో అధిక నాణ్యతా ప్రమాణాలు పాటించలేకపోతున్నారన్నారు. దీనిని అధిగమించేందుకు ఇష్రె వంటి సంస్థలు గ్రామీణ ప్రజలకు ఉన్నత సేవలు అందించాలని సూచించారు. ఇష్రె విశాఖపట్నం చాప్టర్ అధ్యక్ష, కార్యదర్శులు మొహమ్మద్ యాసిన్ బాబా, ఎన్.రాంప్రసాద్ మాట్లాడుతూ సోలార్ మూవెంట్ ప్రారంభమైనప్పటి నుంచి క్రమక్రమంగా ప్రైవేట్, ప్రభుత్వ సెక్టార్లు సోలార్ ఆధారిత ఉత్పత్తులపై ఆధారపడుతున్నాయన్నారు. తద్వారా పర్యావరణ పరిరక్షణకు అవకాశం ఏర్పడుతోందన్నారు. సదస్సులో అత్యాధునిక టెక్నాలజీని వినియోగించిన హెచ్‌వి ఎసి, స్మార్ట్ హోమ్స్, ఎలక్ట్రికల్, బిల్డింగ్ ఆటోమేషన్ వంటి వివిధ రకాల సబ్జెక్టులపై అవగాహన కల్పించారు. ఇష్రె విశాఖపట్నం చాప్టర్ ట్రెజరర్ వి.కామేశ్వరరావు, కన్వీనర్లు డొక్కా రవీంద్రనాథ్, యుఎంసి పట్నాయక్, పూర్వపు అధ్యక్షులు కుమార్ రాజా, ఛాప్టర్ ఫౌండర్ లీలా ప్రసాద్ గాయత్రి, గీతం యూనివర్సిటీ విద్యార్థులు, లోకల్ హెచ్‌వి ఎసి డీలర్లు, నేషనల్ పార్టనర్లు పాల్గొన్నారు.

టిడిపితో రాష్ట్రం అభివృద్ధి



మాట్లాడుతున్న అబ్రహం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు హయాంలోనే రాష్ట్రం అభివృద్ధితో పథంలో నడిచిందని ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు సివేరి అబ్రహం తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, వైసిపి మూడేళ్ల పాలనలో మన్యం అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని చెప్పారు. మన్యం వాసులు అభివృద్ధికి నోచుకోక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తూ పాలన సాగిస్తున్న వైసిపి తీరును ప్రజల దృష్టికి తీసుకెళ్లి ప్రచారం సాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ అరకు పార్లమెంట్ కోశాధికారి వి.నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు టి సుబ్బారావు, టిఎన్‌టియుసి అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఎం.స్వామి, నాయకులు కే.సుబ్బారావు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సరుకుల పంపిణీ



సరుకులు ఇస్తున్న నేతలు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో గత 20 రోజుల క్రితం ఒకే కుటుంబం నుండి తల్లీ, కొడుకులు మరణించడంతో బాధిత కుటుంబానికి మండల వైసిపి అధ్యక్షుడు పాంగి మల్లికార్జున ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను అందజేశారు. గత నెలలో గంపరాయి పుష్ప, ఆమె కొడుకు గంపరాయి సాయికుమార్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ కుటుంబాన్ని పరామర్శించి పెద్దకర్మకు సరుకులు సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షులు పాంగి మల్లికార్జున్, సీనియర్ నేత గాసిరాం, సన్యాసిరావు, తిరుపతి, పెద్దగూడ సర్పంచ్ బాబురావుచ రాజారావు పాల్గొన్నారు.

పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలో కించాయిపుట్టు పంచాయతీ దారపల్లి గ్రామంలో రెండవ విడత నాడు నేడులో భాగంగా రూ.33 లక్షలతో పాఠశాల భవన నిర్మాణానికి నిధులు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు శుక్రవారం స్థానిక సర్పంచ్ సుభాష్ చంద్ర భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం దాసు పడాల్ మాట్లాడుతూ, పాఠశాల భవనంకు భూమిని దానం చేసిన కుటుంబ సభ్యులలో ఒకరికి ఉపాధి అవకాశం నిమిత్తం ఎంఈఓ, ఉన్నతాధికారులపై నివేదిక పంపుతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పాటు భోయి సత్యనారాయణ, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం మాణిక్యాలరావు, విద్యా కమిటీ ఛైర్మన్ సుమన్ పాల్గొన్నారు.

పిఎసిఎస్‌లతో మేలు



జెండా ఎగుర వేస్తున్న ఛైర్మన్

ప్రజాశక్తి -హుకుంపేట: వ్యవసాయ సహకార పరపతి సంఘం(పిఎసిఎస్) ద్వారా రైతులు లబ్ధి పొందాలని సంఘం ఛైర్మన్ కిల్లో రామకృష్ణ అన్నారు. 69వ అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో జెండాను స్థానిక సర్పంచ్ సమిడ వెంకట పూర్ణిమతో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ, వ్యవసాయ సహకార సంఘం ద్వారా గతంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ రైతులను ఆదుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది అప్పలనాయుడు, జోగేశ్వరరావు, కృష్ణంరాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - కొయ్యూరు : ఎపి మహిళా సమాఖ్య మండల కమిటీ ఎన్నిక శుక్రవారం జరిగింది. సమాఖ్య మండల అధ్యక్షురాలుగా కూడా కొండమ్మ, కార్యదర్శిగా సుర్ల రత్నం, ఉపాధ్యక్షురాలు గార్ల వరలక్ష్మి కోశాధికారిగా మెల్ల దేవమణి, సభ్యులుగా మాదల వెంకయ్యమ్మ సుర్ల పెంటమ్మ, ఉల్లి లక్ష్మి, అల్లం పైడితల్లి, శ్రీదరి లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

'ఉపాధి హామీ' పనులు సకాలంలో పూర్తి

ప్రజాశక్తి - రంపచోడవరం : ఉపాధి హామీ కింద చేపట్టిన పనులకు సంబంధించిన మస్తర్లు ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని, ఇప్పటి వరకు ప్రారంభించిన పనులను సకాలంలో పూర్తి చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో ఏడు మండలాలకు సంబంధించిన ఉపాధి హామీ పథకం ఎపీడీలు, ఏపీఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ జాబు కార్డులు ప్రతి వ్యక్తికి 100 రోజుల పనులు కల్పించే బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. అక్టోబర్, నవంబర్ నెలల్లో ఎన్ని మస్తరులు పెండింగ్‌లో ఉన్నాయో ఆరా తీశారు. ఉపాధి హామీ పనులపై గ్రామ సభలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మస్తర్లు, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్లో తప్పులు ఉండటం వల్ల కొంతమందికి ఉపాధి పనులకు సంబంధించిన మస్తర్లు అప్లోడ్ అవటం లేదని సంబంధిత అధికారులు పిఒ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీడీలు కె.చిట్టిబాబు, ఎం.భాగ్యరావు, ఏపీవోలు ప్రకాష్, సురేష్, రెడ్డి బాబు, బి.శ్రీనివాసరావు, మణికుమారి, జి.సంధ్యారాణి, సాయిబాబా, జెఇ రాజు పాల్గొన్నారు.

సిపిఐ మండల కార్యదర్శిగా దేముడు

ప్రజాశక్తి- కొయ్యూరు : సిపిఐ మండల కార్యదర్శిగా ఇరవాడ దేముడు ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. సిపిఐ మండల సహాయ కార్యదర్శిగా పొట్టిక మల్లేష్, కమిటీ సభ్యులుగా పాలపర్తి సత్యనారాయణ, కస్తూరి రమేషు ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో సిపిఐ అల్లూరి జిల్లా కార్యదర్శి పోట్టిక సత్యనారాయణ పాల్గొన్నారు.

పారదర్శకంగా సచివాలయ సేవలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : సచివాలయాల ద్వారా ప్రజలకు పారదర్శకంగా సిబ్బంది సేవలు అందించాలని స్థానిక ఎంపీడీవో కె.బాపన్నదొర ఆదేశించారు. శుక్రవారం మండలంలోని గడుఓకుర్తి పంచాయితీలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాల భవనాలను శుక్రవారం పర్యవేక్షించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. పలు సచివాలయాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించి రికార్డులు పరిశీలించారు. విధి నిర్వహణలో ఆలసత్వం వహిస్తే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కెనరా గ్రామంలో ఆధార్ అప్డేట్ ప్రోగ్రాం పర్యవేక్షించి సిబ్బందికి సూచనలు చేశారు.

శరవేగంగా నాడు-నేడు పనులు

ప్రజాశక్తి- సీలేరు : జికె.వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాడు-నేడు పనులు శరవేగంగా జరుగుతున్నట్లు టాయిలెట్స్, మరమత్తు పనులు చేపడుతున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ సాయిరాం తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నాడు నేడు కింద రూ.21 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. టాయిలెట్స్ మరమ్మతులతో పాటు, మంచినీటి సౌకర్యం నిమిత్తం బోరుబావి, ట్యాంకు ఏర్పాటు చేశామన్నారు. కళాశాల భవనాల పైకప్పులు తొలగించి నూతనంగా వేస్తున్నట్లు చెప్పారు.

కృష్ణకు ఘన నివాళి

ప్రజాశక్తి - ఎంవిపి. కాలనీ : ఇటీవల మరణించిన సూపర్ స్టార్ కృష్ణ సంతాప సభను శుక్రవారం ఆంధ్ర విశ్వ విద్యాలయం మానవ వనరుల అభివృద్ధి కేంద్రం సెమినార్ హాలులో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యాన నిర్వహించారు. కృష్ణ చిత్రపటం వద్ద అందరూ నివాళ్లర్పించారు. సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ఆచార్య ఎన్ఎడి.పాల్, నరవ ప్రకాశరావు మాట్లాడారు.